క్లుప్తంగా

ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: బదిలీల కారణంగా రెండు నెలలుగా వేతనాలు చెల్లింపులకు నోచుకోక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులకు వేతన చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని ఏపీ వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ నగర అధ్యక్షుడు చందోలు రవికుమార్ పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం గుంటూరు వెస్ట్ ఎంఈవో-1 హవీలాను కలిసి ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు. పశ్చిమ పరిధిలో ఇప్పటికీ 180 మంది ఉపాధ్యాయులకు వేతనాలు అందలేదని, ఐడీలు క్రియేట్ కాకపోవడంతో సమస్యలు ఎదురైనట్లు వివరించారు. తూర్పు ఎంఈఓ కార్యాలయాన్ని విభజించి, గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఏర్పాటు చేసే దిశగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అదే విధంగా ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల పరిష్కారం కోరుతూ ఫ్యాప్టో పిలుపు మేరకు శనివారం జిల్లా కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన ధర్నాకు తాము మద్దతు ఇస్తున్నట్లు రవికుమార్ తెలిపారు. ఎంఈఓకు విన్నవించిన వారిలో సంఘ నాయకులు శేషిరెడ్డి, సురేష్, శేఖర్, మోజెస్, దివ్య, ప్రమీల, రమేష్‌బాబు, మహేష్ ఉన్నారు.

స్టేడియం ఎన్నికకు ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

నెహ్రూనగర్: ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ పాలకవర్గ ఎన్నికల నిర్వహణకు మొత్తం 59 నామినేషన్లు వచ్చాయని నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్, ఎన్టీఆర్ స్టేడియం ఎక్స్ అఫీషియో జాయింట్ సెక్రటరీ, ఎన్టీఆర్ స్టేడియం పాలకవర్గ ఎన్నికల నిర్వహణ అధికారి డి.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారంతో నామినేషన్ల ప్రక్రియ పూర్తయిందన్నారు. శుక్రవారం 42 నామినేషన్లు వచ్చాయన్నారు. వీటిలో వైస్ ప్రెసిడెంట్‌కి 5 నామినేషన్లు, సెక్రటరీకి 5 నామినేషన్లు, జాయింట్ సెక్రటరీకి 11 నామినేషన్లు, ట్రెజరర్‌కు 6 నామినేషన్లు, ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్స్ 15 నామినేషన్లు వచ్చాయన్నారు.

రోడ్లపై పుట్టిన రోజు కేక్‌లు కట్ చేయవద్దు

నగరంపాలెం: పుట్టినరోజు వేడుకలను ఇళ్లల్లో నిర్వర్తించాలని, బహిరంగ ప్రదేశాల్లో చేయవద్దని తూర్పు సబ్ డివిజన్ డీఎస్పీ అబ్దుల్‌అజీజ్ అన్నారు. రెండు రోజుల క్రితం పాతగుంటూరు పీఎస్ పరిధిలోని ఓ రహదారిపై పుట్టినరోజు వేడుకలు నిర్వహించిన యువకులపై పాతగుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారని శుక్రవారం తెలిపారు. పోలీస్ చట్టం 30 అమల్లో ఉందని డీఎస్పీ అన్నారు. పుట్టిన రోజులు వేడుకలు నిర్వర్తించి, తద్వారా ప్రజలకు ఇబ్బంది కలిగించారని చెప్పారు. అదిగాక కేక్ కట్ చేస్తూ అల్లర్లు సృష్టించారని డీఎస్పీ వివరించారు. రహదారులపై వాహనాలు నిలిపి కేక్‌లు కట్ చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

మందుబాబులకు జరిమానా

పాతగుంటూరు పీఎస్ పరిధిలో మూడు రోజుల క్రితం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి పది మందిపై కేసు నమోదు చేసినట్లు పాతగుంటూరు పీఎస్ సీఐ వెంకటప్రసాద్ తెలిపారు. వీరిని శుక్రవారం గుంటూరు ఆరో ఏజేసీజే కోర్టులో హాజరుపరిచామని సీఐ చెప్పారు. రూ.48 వేలు జరిమానా జడ్జి విధించారని పేర్కొన్నారు.

అశ్లీల ఓటీటీలపై చర్యలు తీసుకోవాలి

నగరంపాలెం: అశ్లీల ఓటీటీలను కేంద్రం నిషేధించాలని కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు మాజీ సభ్యులు, చిత్ర దర్శకుడు దిలీప్‌రాజా అన్నారు. గుంటూరు నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో శుక్రవారం మా-ఏపీ గుంటూరు సభ్యుల సమావేశం నిర్వహించారు. దిలీప్‌రాజా మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అశ్లీల కంటెంట్‌కు కేరాఫ్‌గా నిలిచిన ఓటీటీల అన్నింటిని కేంద్రం నిషేధించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం నిషేధించిన 24 ఓటీటీలే కాకుండా అనేకం ఉన్నాయని అన్నారు. మొబైల్‌లో 'ఏఐ' అమ్మాయిల రెచ్చగొట్టే సెక్స్ వ్యాఖ్యలపై కేంద్ర సమాచార ప్రసారశాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్‌కు ఫిర్యాదు చేసేందుకు సమావేశంలో తీర్మానం చేశామన్నారు. ప్రొడక్షన్ మేనేజర్ మంచాల విజయ్‌కిషోర్‌బాబు,సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో అన్నమయ్య కళావేదికపై నిర్వహిస్తోన్న సంగీత నృత్యోత్సవాలు శుక్రవారం మూడో రోజుకి చేరాయి. శ్రీదాస సాహిత్య ప్రాజెక్ట్, తీతీదే, కంచి కామకోటి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం(గుంటూరు), ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ న్యూఢిల్లీ (తిరుపతి రీజియన్), ద్వారం లక్ష్మీ అకాడమీ ఫర్ మ్యూజికల్ సర్వీసెస్ (తిరుపతి) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలను ద్వారం లక్ష్మీ దంపతులు, ఆలయ పాలక మండలి కమిటీ జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. తొలుత ఎం.అంజనా సుధాకర్, లంకా తేజస్వి బృందం, ప్రముఖ విద్వాంసులు మోదుమూడి సుధాకర్‌ల శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించారు. ప్రేక్షకులను అలరించాయి. వయోలిన్‌పై పెరవలి నందకుమార్, మృదంగంపై కార్తికేయ ఆదినారాయణశర్మ వాయిద్యాన్ని అందించారు. అనంతరం కళాకారులను, అతిథులను ద్వారం లక్ష్మీ అకాడమీ ఫర్ మ్యూజికల్ సర్వీసెస్ నిర్వాహకులు సత్కరించారు.





శ్రావణ శుక్రవారం పూజలు







శ్రావణ మాసం రెండో శుక్రవారం నగరంలో అమ్మవారి ఆలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేసి, పూజలు నిర్వహించారు. భక్తులు వ్రతాల్లో అధికార సంఖ్యలో పాల్గొన్నారు.
–సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొరిటిపాడు: 11 కేవీ లైన్ షిఫ్టింగ్ దృష్ట్యా శనివారం సరఫరాలో అంతరాయం ఉంటుందని గుంటూరు -2 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.గురవయ్య శుక్రవారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. విద్యుత్ గుజ్జనగుండ్ల, ఎస్వీఎన్‌కాలనీ 4వలైను తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు. రోడ్డు వైండింగ్ పనులు, లైన్ మెయిన్‌టెన్స్‌లో భాగంగా ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పట్టాభిపురం, ఎన్‌సీసీ అపార్టుమెంట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.

రేపు ప్రత్యేకావసరాల బాలలకు వైద్య నిర్ధారణ శిబిరం

గుంటూరు ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఈనెల 3న తూర్పు నియోజకవర్గ పరిధిలోని ప్రత్యేకావసరాల బాలలకు వైద్య నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తూర్పు ఎంఈఓలు అబ్దుల్ ఖుద్దూస్, జ్యోతికిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రాడీపేటలోని సమగ్రశిక్ష జిల్లా వనరుల కేంద్రం(డీఆర్సీ)లో ఉదయం 10 గంటలకు బ్రాడీపేట 2/12లోని శారదానికేతన్ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వివరాలకు 99890 85102 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నగర అభివృద్ధిలో కూటమి విఫలం

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు సమన్వయకర్త నూరి ఫాతిమా



అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న నూరిఫాతిమా

నెహ్రూనగర్: కూటమి నేతలు, అధికారులు కమీషన్ల కోసం కాకుండా ప్రజల మెప్పుకోసం పని చేసి వారి మన్ననలు పొందాలని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షులు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా సూచించారు. నియోజకవర్గంలోని 7వ వార్డు మాయాబజార్‌లో 4 నెలల క్రితం సగం రోడ్డు వేసి వదిలేసిన నేపథ్యంలో అక్కడి వ్యాపారులు పడుతున్న బాధలు తెలుసుకునేందుకు శుక్రవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ డెప్యూటీ మేయర్ నివాసముండే ప్రాంతంలో రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా ఉందంటే పాలకులు ప్రజల సమస్యలను ఏ విధంగా గాలికి వదిలేస్తున్నారో స్పష్టంగా అర్థమవుతుందన్నారు. ముఖ్యంగా తూర్పు నియోజకవర్గంలో రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించడంలేదని ఆరోపించారు. బిల్లు చెల్లిస్తేనే పనులు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్లు చెబుతున్నారని, ఇంకొకరు పనులు చేద్దాంలే.. చూద్దాంలే అని దాటవేసే ధోరణితో ఉన్నారని వివరించారు. ఎక్కువ రోజువారీ వేతనం మీద బతికే కుటుంబాలు ఉన్నాయని.. అటువంటి వ్యాపారులను రోడ్డు ఆక్రమణల పేరుతో తొలగిస్తున్నారని.. ఆక్రమణలు తొలగిస్తే అందరివి సమానంగా తొలగించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే సిఫార్సులు ఉన్నాయని వారి జోలికి పోకుండా మిగిలిన వారి మీద అధికారులు ప్రతాపం చూపడం సమంజసం కాదని హితవు పలికారు. సమస్యలపై సోమవారం పీజీఆర్ఎస్‌లో నగర కమిషనర్‌ను కలసి ఫిర్యాదు చేయనున్నట్లు నూరి ఫాతిమా చెప్పారు.

కార్పొరేషన్ పరిధిలో అనధికార కట్టడాలపై చర్యలు

కమిషనర్ పులి శ్రీనివాసులు



సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో అనధికార కట్టడాలను ఉపేక్షించబోమని, పట్టాభిపురంలో నిర్దేశిత భవన నిర్మాణ ప్లాన్ లేకుండా, నిబంధనలు పాటించకుండా జరుగుతున్న నిర్మాణాన్ని కూల్చి వేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టాభిపురం, స్తంభాల గరువు, మిర్చి యార్డు రోడ్, వీఐపీ రోడ్లలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో నగర పాలక సంస్థ నుంచి నిర్దేశిత భవన నిర్మాణ ప్లాన్ తీసుకోకుండా లేదా ప్లాన్‌కి భిన్నంగా నిర్మాణాలు చేస్తే పట్టణ ప్రణాళిక అధికారులు సదరు నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చి, చట్ట ప్రకారం కూల్చి వేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ ప్లాన్ మంజూరుకు అనేక నిబంధనలకు సరళతరం చేసినప్పటికీ ప్లాన్ తీసుకోవడంలో నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. సచివాలయం పరిధిలో అనధికార, అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే పర్యవేక్షణ చేయాల్సిన వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు, అధికారులు ఏమి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్లు, డ్రెయిన్ల ఆక్రమణల తొలగింపుపై ఇప్పటికే పలు దఫాలు తెలియచేసినా కొందరు మారడం లేదని, అటువంటి ఆక్రమణలను తక్షణం తొలగించాలని ఆదేశించారు. ఆక్రమణల తొలగింపు వాహనాలు రాత్రి సమయాల్లో కూడా వార్డుల వారీగా మెయిన్ రోడ్లపై పర్యటించి, ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏసీపీ రెహ్మాన్ పాల్గొన్నారు.

ఆస్తుల ఆటో మ్యూటేషన్‌తో ప్రజలకు మేలు

రిజిస్ట్రేషన్ సమయంలోనే ఆస్తులకు ఆటో మ్యూటేషన్ అమలు చేయడం ద్వారా ప్రజలకు సమయం, ఖర్చులు ఆదా అవుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం జిల్లా రిజిస్ట్రార్ డి.శైలజ, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసులతో కలసి నల్లపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆస్తులకు ఆటో మ్యూటేషన్ అమలు ప్రక్రియని పరిశీలించారు. కార్యక్రమంలో నల్లపాడు సబ్ రిజిస్ట్రార్ గోపాల్ పాల్గొన్నారు.

• 5న అతిథి అధ్యాపకుల ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో జంతుశాస్త్ర బోధన కోసం అతిథి అధ్యాపకుల ఎంపికకు ఈనెల 5న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులందరూ ధ్రువపత్రాలతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

వైభవంగా సామూహిక కుంకుమ పూజలు



మారుతీనగర్‌లో అమ్మవారికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకార్చనలు

నగరంపాలెం: స్థానిక మారుతీనగర్ శ్రీకంచి కామకోటిపీఠ శ్రీమారుతీ దేవాలయ ప్రాంగణంలో శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా సామూహిక లలితా సహస్రనామ సహిత కుంకుమ పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం కుంకుమ పూజలు నిర్వహించారు. ఈనెల ఎనిమిదో తేదీన వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తామని ఆలయ కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ తెలిపారు.

– స్థానిక సిద్ధార్థనగర్ 11వ వీధిలోని శ్రీకనకమహాలక్ష్మీ మందిరంలో అమ్మవారికి శ్రావణ శుక్రవారం విశేష కుంకుమార్చనలు నిర్వహించారు. పండితుల వేదమంత్రాల నడుమ అమ్మవారికి ప్రత్యేకాలంకరణ చేశారు. సువాసినులు కుంకుమార్చనలు విశేషంగా చేపట్టారు. ప్రత్యేక హారతి, మంత్రపుష్పం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమాలను వ్యవస్థాపకులు ఘంటసాల విజయస్వామి పర్యవేక్షించారు.

సుగంధ ద్రవ్యాలతో అమ్మవారికి అభిషేకార్చనలు

నగరంపాలెం: స్థానిక అరండల్‌పేట 4/4వ అడ్డరోడ్డులోని అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణ స్వామి కోటి కుంకుమార్చన ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి. రెండో శుక్రవారం నిత్య పూజలు, సుగంధ ద్రవ్యాలతో అమ్మవారికి అభిషేకార్చన నిర్వహించారు. అనంతరం కలువ పూలతో అర్చన, వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని అర్చించి విశేష హారతులిచ్చారు. ప్రత్యేకంగా నక్షత్ర హారతి వేద మంత్రాలతో పూజలు చేపట్టారు. సువాసినులకు, భక్తులకు తీర్థ, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు మర్రిపాటి ప్రసాద్ శర్మ మాట్లాడుతూ రెండో మంగళవారం 108 కిలోల పసుపుతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చెప్పారు.

వెయ్యి బంగారు కుటుంబాల బాధ్యత తీసుకున్న డాక్టర్ రాఘవశర్మ



గుంటూరు మెడికల్: సీనియర్ కార్డియాలజిస్ట్, లలితా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ పి.వి.రాఘవశర్మ వెయ్యి కుటుంబాల బాధ్యత తీసుకుని ఎంతో మందికి మార్గదర్శకులయ్యారని తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మక చేపట్టిన మార్గదర్శి- బంగారు కుటుంబం, పీ-4 కార్యక్రమంలో భాగంగా డాక్టర్ రాఘవ శర్మ వెయ్యి బంగారు కుటుంబాల బాధ్యత తీసుకున్నారు. ఈసందర్భంగా శుక్రవారం గుంటూరు కొత్తపేటలోని లలితా హాస్పిటల్‌లో డాక్టర్ రాఘవశర్మను ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, గుంటూరు నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్ చల్లా ఓబులేసు సన్మానించారు. ఈసందర్భంగా డాక్టర్ రాఘవ శర్మ మాట్లాడుతూ పబ్లిక్, ప్రైవేటు పీపుల్ పాట్నర్‌షిప్ అనే పీ-4 కార్యక్రమంతో సమాజంలో మంచి జరుగుతోందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా అర్హులైన వ్యక్తులకు ప్రథమ చికిత్సలో శిక్షణ, యువ వలంటీర్లకు సీపీఆర్‌లో శిక్షణ, సాంకేతిక ఉపాధి అవకాశాల గురించి అవగాహన కల్పిస్తూ కెరీర్ గైడెన్స్, టీచింగ్, న్యూట్రీషియన్, హెల్త్ ఎడ్యుకేషన్, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో ఉచిత అంబులెన్సు సదుపాయం, 24 గంటలూ టెలిఫోన్ ద్వారా వాట్సాప్ ద్వారా సహాయ సహకారాలు అందుబాటులో ఉంటామని వివరించారు. ఆ విధంగా దత్తత తీసుకున్న బంగారు కుటుంబాలకు చేయూతనందిస్తామన్నారు. పెద్దవారు, పిల్లలకు రెగ్యులర్‌గా హెల్త్ చెకప్, కంటి పరీక్షలు, బీపీ, షుగర్ వంటి వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అడిషనల్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ గతంలో కూడా డాక్టర్ రాఘవ శర్మ పలు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారని, నేడు పీ-4 కార్యక్రమంలో భాగస్వాములవడం అభినందనీయమని చెప్పారు.

హెచ్‌ఎంగా సుబ్బారావు సేవలు ప్రశంసనీయం



సుబ్బారావు, సుకన్య దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం జెడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడిగా గుంద్ర సుబ్బారావు సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పాఠశాల ఆవరణలో శుక్రవారం ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యారంగానికి సుబ్బారావు చేసిన సేవలు ప్రశంసనీయమని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తి బాధ్యతతో కూడుకున్నదని పేర్కొన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో, వారి బంగారు భవిష్యత్తుకు దిశానిర్దేశం చేయడంలో సుబ్బారావు కీలకపాత్ర పోషించారని కొనియాడారు. ఆయన వద్ద చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు దేశ, విదేశాల్లో స్థిరపడ్డారని తెలిపారు. అనంతరం సుబ్బారావు, సుకన్య దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కిట్స్‌లో ముగిసిన అధ్యాపక అభివృద్ధి కార్యక్రమం

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (కిట్స్)లో ఐదు రోజులుగా జరుగుతున్న అధ్యాపక అభివృద్ధి కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. జేఎన్‌టీయూకె సహకారంతో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో సిద్ధాంత పాఠాలు, హ్యాండ్స్-ఆన్ సెషన్లు, సిమ్యులేషన్లతో కూడిన ఆధునిక ఏఐ టెక్నాలజీలు, డేటా అనలిటిక్స్, మోడల్ ఆప్టిమైజేషన్ వంటి అంశాలపై అధ్యాపకులకు అవగాహన కల్పించారు. ఏఐ రంగంలో తాజా పరిశోధనలు, ఆవిష్కరణలు, వైద్యం, పరిశ్రమ, వ్యవసాయం వంటి విభిన్న రంగాల్లో అనువర్తనాలపై శిక్షణ ఇచ్చారు. భవిష్యత్తులో ఏఐలో క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రాధాన్యతను వివరించారు. ఎఫ్‌డిపికి రిసోర్స్ పర్సన్లుగా డాక్టర్ తరుణ్‌కుమార్‌రెడ్డి (ఐఐటీ రూర్కీ), డాక్టర్ గౌరవ్ కుమార్‌నాయక్ (ఐఐటీ రూర్కీ), డాక్టర్ రామ్ బిలాస్ పచోరి (ఐఐటీ ఇండోర్), డాక్టర్ రవికుమార్ (ఎన్ఐటి వరంగల్), డాక్టర్ సరళ పచ్చల (కిట్స్)లు వ్యవహరించారు. ముగింపు కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, కార్యదర్శి కోయి శేఖర్‌లు పాల్గొన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే ఆపద సమయంలో ప్రాణాలను కాపాడే పద్ధతులపై అవగాహన అవసరమని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. శుక్రవారం చంద్రమౌళీనగర్‌లోని భాష్యం ప్రధాన క్యాంపస్‌లో అత్యవసర పరిస్థితుల్లో బాధితుల ప్రాణాలను కాపాడే సీపీఆర్‌పై ప్రాజెక్ట్ హార్ట్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించడమే కాకుండా ఇటువంటి కార్యక్రమాల నిర్వహణ ద్వారా వారిలో ఆచరణాత్మక జ్ఞానం అలవడుతుందని అభిప్రాయపడ్డారు. జిల్లా వైద్యారోగ్యశాఖాధికారిణి డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఆపద సమయంలో వ్యక్తి ప్రాణాలను కాపాడే విధానాలపై అవగాహన కల్పించడం అవసరమని పేర్కొన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ సీపీఆర్‌పై విస్తృత రీతిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ ప్రాజెక్ట్ హార్ట్ ఇండియా సంస్థతో అనుసంధానమై భాష్యం విద్యాసంస్థల్లో ఐదు వేల మంది విద్యార్థులకు 10 రోజుల పాటు బ్యాచ్‌ల వారీగా సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తామని తెలిపారు. అనంతరం సీపీఆర్ పై అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రాజెక్ట్ హార్ట్ ఇండియా వ్యవస్థాపకుడు డాక్టర్ వేమూరి మూర్తి వీడియో సందేశం అందించారు. ప్రాజెక్ట్ హార్ట్ ఇండియా సహ వ్యవస్థాపకుడు, తెలంగాణ రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ శ్రీనివాస్ రమక మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రప్రథమంగా భాష్యం విద్యాసంస్థల సహకారంతో ఈ కార్యక్రమాన్ని భాష్యం విద్యాసంస్థల్లో లాంఛనంగా ప్రారంభించామని చెప్పారు. హైస్కూల్ విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించేందుకు పాఠశాల యాజమాన్యాలను భాగస్వాములను చేస్తూ ప్రాంతీయ భాషల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. తొలుత పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు, భాష్యం విద్యాసంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, ప్రాజెక్ట్ హార్ట్ ఇండియా ఏపీ సమన్వయకర్త డాక్టర్ కొడాలి లావణ్య పాల్గొన్నారు.